# ఇండియన్ పాలిటీ

## రాజకీయ పార్టీలు

ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో రాజకీయ పార్టీలు గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయి. ప్రజలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావడానికి రాజకీయ పార్టీలు కృషి చేస్తున్నాయి. ప్రజాభిప్రాయాన్ని సమీకరించి, సంఘటితపరచి, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసి, ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో ఇవి కీలకమయ్యాయి.

జాతి ప్రయోజనాలను పెంపొందించే లక్ష్యంతో ఒకే రకమైన రాజకీయ దృక్పథాలను పంచుకొని రాజ్యాంగబద్ధంగా రాజకీయ అధికారాన్ని సాధించడానికి కృషి చేసే కొంతమంది వ్యక్తుల సముదాయాన్ని రాజకీయ పార్టీగా పరిగణించవచ్చు.

★ లోవెల్ అనే రాజనీతిజ్ఞుడు రాజకీయ పార్టీలను 'ప్రజాభిప్రాయ దళారులు' అని అభివర్ణించారు.

ప్రపంచంలో 3 రకాల పార్టీ వ్యవస్థలు ఉన్నాయి.

**ఏకపార్టీ వ్యవస్థ:** చైనా, వియత్నాం, క్యూబా దేశాల్లో అమల్లో ఉంది.

**ద్విపార్టీ వ్యవస్థ:** అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల్లో అమల్లో ఉంది.

**బహుళ పార్టీ వ్యవస్థ:** ఇండియా, ఫ్రాన్స్, జపాన్ దేశాల్లో అమల్లో ఉంది.

### భారత రాజ్యాంగం ప్రకారం..

★ మనదేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధమైనవి కావు. అయితే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న ఆర్టికల్ 19(1)(C)లోని 'సంఘాలు లేదా అసోసియేషన్లు' అనే అంశాన్ని ఆధారంగా చేసుకుని పౌరులు రాజకీయ పార్టీలను స్థాపించుకోవచ్చు.

★ రాజీవ్‌గాంధీ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చట్టం - 1985 ద్వారా రాజ్యాంగానికి 10వ షెడ్యూల్‌ను చేర్చి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'రాజకీయ పార్టీలు' అనే అంశాన్ని వివరించారు.

### ఎన్నికల సంఘం - రాజకీయ పార్టీల గుర్తింపు

★ భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 29(A) ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు గుర్తింపుని స్తుంది.

★ రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కనీసం 100 మంది ఓటర్లతో సంతకాలు చేయించి, రూ. 10,000 డిపాజిట్‌గా చెల్లించి కేంద్ర ఎన్నికల సంఘం వద్ద 'రాజకీయ పార్టీ'గా నమోదు చేయించుకోవచ్చు.

★ రాజకీయ పార్టీలకు ఎన్నికల గుర్తులను కేటాయించే సందర్భంలో ఎన్నికల కమిషన్ విచక్షణాధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదు.

**పార్టీల వర్గీకరణ:** మనదేశంలో రాజకీయ పార్టీలను రెండు రకాలుగా వర్గీకరించారు.

1) జాతీయ పార్టీ

2) రాష్ట్ర పార్టీ

### జాతీయ పార్టీ

ఒక రాజకీయ పార్టీని జాతీయ పార్టీగా గుర్తించాలంటే కింద పేర్కొన్న షరతుల్లో ఏదైనా ఒకదాన్ని నెరవేర్చాలి.

i) గత చివరి సాధారణ ఎన్నికల్లో లోక్ సభ లేదా రాష్ట్ర శాసనసభ స్థానాలకు నాలుగు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో అభ్యర్థులు పోటీచేసినప్పుడు పోలై చెల్లుబాటు అయిన ఓట్లలో కనీసం 6% ఓట్లను సాధించాలి. దీంతో పాటు కనీసం నలుగురు అభ్యర్థులు లోక్‌సభకు ఎన్నిక కావాలి.

ii) కనీసం 4 రాష్ట్రాల్లో రాష్ట్ర పార్టీగా గుర్తింపు పొందాలి.

iii) గత చివరి సాధారణ ఎన్నికల్లో లోక్‌సభలోని మొత్తం సీట్లలో కనీసం 2% సీట్లు (11 సీట్లు) గెలుచుకొని ఉండాలి. ఈ అభ్యర్థులు కనీసం మూడు వేర్వేరు రాష్ట్రాల నుంచి ఎన్నికవ్వాలి.

★ ప్రస్తుతం మనదేశంలో ఏడు జాతీయ రాజకీయ పార్టీలు ఉన్నాయి.

## రాష్ట్ర పార్టీ

ఒక రాజకీయ పార్టీని రాష్ట్ర పార్టీగా గుర్తించాలంటే కింద పేర్కొన్న షరతుల్లో ఏదైనా ఒకదాన్ని నెరవేర్చాలి.

i) రాష్ట్ర శాసనసభకు జరిగిన గత చివరి సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థులు రాష్ట్రం మొత్తంలో పోలై చెల్లుబాటైన ఓట్లలో కనీసం 6 శాతం ఓట్లను సాధించాలి. దీంతోపాటు కనీసం ఇద్దరు అభ్యర్థులు రాష్ట్ర శాసనసభకు ఎన్నికవ్వాలి.

ii) గత చివరి శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర శాసనసభలోని మొత్తం సీట్లలో కనీసం 3 శాతం లేదా 3 సీట్లను గెలుపొందాలి.

iii) లోక్‌సభకు జరిగిన గత చివరి సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థులు రాష్ట్రం మొత్తంలో పోలై చెల్లుబాటైన ఓట్లలో కనీసం 6 శాతం ఓట్లను సాధించాలి. దీంతోపాటు కనీసం ఒక అభ్యర్థి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

iv) గత చివరి లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రానికి కేటాయించిన మొత్తం లోక్‌సభ సీట్లలో ప్రతి 25 సీట్లకు కనీసం ఒక అభ్యర్థి చొప్పున ఎన్నికవ్వాలి.

### జాతీయ పార్టీ హోదాకు నియమాలు

2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (NCP), బహుజన సమాజ్ పార్టీ (BSP), భారత కమ్యూనిస్టు పార్టీ (CPI)ల జాతీయ పార్టీ హోదా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన నూతన నిబంధనల ప్రకారం వరుసగా రెండు సార్వత్రిక ఎన్నికల్లో జాతీయ హోదాకు నిర్దేశించిన ఓట్లు, సీట్లు సాధించలేకపోతే జాతీయ పార్టీ హోదా రద్దవుతుంది. కాబట్టి 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు జాతీయ హోదా ఉన్న NCP, BSP, CPI లకు ప్రస్తుతం ఆ హోదా కొనసాగుతోంది.

### రాజకీయ పార్టీలు - అధికారిక పత్రికలు

| పార్టీ | పత్రిక పేరు |
|---|---|
| శివసేన | సామ్నా |
| భాజపా | జాగృతి |
| సీపీఐ | న్యూ ఏజ్ |
| సీపీఐ(ఎం) | పీపుల్స్ డెమోక్రసీ |

| జాతీయ పార్టీ పేరు | స్థాపన | ప్రస్తుత అధ్యక్షులు | చిహ్నం |
|---|---|---|---|
| భారత జాతీయ కాంగ్రెస్ | 1885 | - | హస్తం |
| భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) | 1925 | ఎస్. సుధాకర్‌రెడ్డి | కంకికొడవలి |
| సీపీఐ (మార్క్సిస్ట్) | 1964 | సీతారాం ఏచూరి | సుత్తికొడవలి |
| భారతీయ జనతా పార్టీ | 1980 | అమిత్‌షా | కమలం |
| బహుజన సమాజ్ పార్టీ | 1985 | మాయావతి | ఏనుగు |
| నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ | 1998 | శరద్‌పవార్ | గోడ గడియారం |
| ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ | 1997 | మమతా బెనర్జీ | పూలు, గడ్డి |

### ప్రధాన రాష్ట్ర పార్టీలు

| పార్టీ పేరు | స్థాపన | రాష్ట్రం | చిహ్నం |
|---|---|---|---|
| తెలుగుదేశం | 1982 | ఆంధ్రప్రదేశ్ | సైకిల్ |
| వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ | 2011 | ఆంధ్రప్రదేశ్ | సీలింగ్‌ఫ్యాన్ |
| అసోం గణపరిషత్ | 1985 | అసోం | ఏనుగు |
| శివసేన | 1966 | మహారాష్ట్ర | విల్లు బాణం |
| సమాజ్‌వాది పార్టీ | 1992 | ఉత్తర్‌ప్రదేశ్ | సైకిల్ |
| ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ | 1939 | పశ్చిమ్‌బంగ | సింహం |
| ద్రవిడ మున్నేట్ర కజగం | 1949 | తమిళనాడు | ఉదయిస్తున్న సూర్యుడు |
| ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం | 1972 | తమిళనాడు | రెండు ఆకులు |
| బిజూ జనతా దళ్ | 1997 | ఒడిశా | శంఖం |
| శిరోమణి అకాలీదళ్ | 1920 | పంజాబ్ | త్రాసు |
| జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ | 1932 | జమ్ముకశ్మీర్ | నాగలి |
| ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ | 1987 | హరియాణా | కళ్లజోడు |
| తెలంగాణ రాష్ట్ర సమితి | 2001 | తెలంగాణ | కారు |

### నమూనా ప్రశ్నలు

**1.** రాజకీయ పార్టీలను 'ప్రజాభిప్రాయ దళారులు' అని ఎవరు అభివర్ణించారు?

1) మెకైవర్  2) లోవెల్
3) జీన్‌బోడిన్  4) ఉడ్రోవిల్సన్

**2.** కిందివాటిలో ఏకపార్టీ రాజకీయ వ్యవస్థ లేని దేశం?

1) ఆస్ట్రేలియా  2) చైనా  3) వియత్నాం  4) క్యూబా

**3.** కిందివాటిలో బహుళ పార్టీ రాజకీయ వ్యవస్థ అమల్లో లేని దేశం?

1) ఇండియా  2) ఫ్రాన్స్  3) జపాన్  4) బ్రిటన్

**4.** రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ఆధారంగా మనదేశంలో రాజకీయ పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు?

1) ఆర్టికల్ 20(1)(C)  2) ఆర్టికల్ 19(1)(C)
3) ఆర్టికల్ 18(1)(C)  4) ఆర్టికల్ 21(1)(C)

**5.** రాజీవ్‌గాంధీ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం 'రాజకీయ పార్టీలు' అనే అంశాన్ని రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్‌లో పొందుపరిచింది?

1) 7  2) 8  3) 9  4) 10

**6.** కేంద్ర ఎన్నికల సంఘం 1951 నాటి భారత ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని ఏ సెక్షన్ ప్రకారం రాజకీయ పార్టీలకు గుర్తింపునిస్తుంది?

1) సెక్షన్ 29(A)  2) సెక్షన్ 29(B)
3) సెక్షన్ 30(A)  4) సెక్షన్ 31(A)

**7.** 2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల అనంతరం ఏ రాజకీయ పార్టీల జాతీయ హోదా ప్రశ్నార్థకంగా మారింది?

1) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (NCP)
2) బహుజన సమాజ్ పార్టీ (BSP)
3) భారత కమ్యూనిస్టు పార్టీ (CPI)
4) అన్నీ

**8.** కిందివాటిలో జాతీయ పార్టీ కానిది?

1) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్
2) భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)
3) ఆలిండియా అన్నాద్రవిడ మున్నేట్ర కజగం
4) భారతీయ జనతా పార్టీ

**9.** కిందివాటిలో వివిధ రాజకీయ పార్టీలు వాటి స్థాపనకు సంబంధించి సరికానిది?

1) భారత జాతీయ కాంగ్రెస్ - 1885
2) భారత కమ్యూనిస్ట్ పార్టీ - 1925
3) భారతీయ జనతా పార్టీ - 1989
4) బహుజన సమాజ్ పార్టీ - 1985

**10.** వివిధ రాజకీయ పార్టీల గుర్తులకు సంబంధించి సరికానిది?

1) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ - పూలు, గడ్డి
2) బహుజన సమాజ్ పార్టీ - ఏనుగు
3) కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) - సుత్తికొడవలి
4) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ - సూర్యుడు

**సమాధానాలు**

1-2; 2-1; 3-4; 4-2; 5-4; 6-1; 7-4; 8-3; 9-3; 10-4.

**రచయిత: బంగారు సత్యనారాయణ**